డాక్యుమెంట్ - 1

## "బిసిల ఆత్మగౌరవం, సాధికారత - రాజ్యాధికార సాధన" లక్ష్యంగా

# 'బి.సి. పొలిటికల్ ఫ్రంట్' నిర్మాణం

# 'అధ్యయనం - ఆలోచన - సంఘటితం - ఆచరణ' మన మార్గం

తెలంగాణా వచ్చింతర్వాత గత కొన్ని సంవత్సరాలుగా ఈ రాష్ట్రంలో ఉన్న అనేక బిసి కులాలు, యంబిసిలు, సంచార జాతుల వారు అత్యంత అలజడికి గురవుతున్నారు. తమ అస్తిత్వ పోరాటాలను కూడా పక్కనపెట్టి తెలంగాణా ఉద్యమంలో అత్యధిక సంఖ్యలో పాల్గొన్న బిసిలు, తెలంగాణ వస్తే తమ ఆకాంక్షలు నెరవేరి అందరూ సమాన గౌరవంతో జీవిస్తారని, అధికారానికి దూరంగా ఉంచబడ్డ ఈ అనేక కులాలకు భాగస్వామ్యం లభిస్తుందని, ఉన్నత విద్య – ఉద్యోగం – ఉపాధి లభిస్తుందని, ఆర్థిక స్వావలంబన లభిస్తుందని తమ సామాజిక హక్కులకు పూర్తి రక్షణ కల్గుతుందన్న భావనలు ఒక్కొక్కటి మంచులా కరిగిపోయాయి. ఈ క్రమంలోనే మండల్ నివేదికలో ఒకప్పుడు పేర్కొన్నట్లు, బిసి కులాల ప్రజల **'మెదళ్లలో ఒక విదమైన యుద్ధం మొదలైంది'**. అది విస్పోటంలా పేలి దావానలంగా వ్యాపించే క్రమం ఇంక ఎంతో దూరంలో లేదన్న 'సిగ్నల్స్' స్పష్టంగా కన్పిస్తున్నాయి. తెలంగాణాలో అత్యంత మెజారిటీగా ఉన్న బిసి కులాలు 75 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా 'అర్ధబానిస' బతుకులు ఇంకెంత కాలం గడపాలన్న ప్రశ్నలు, మన అందరిలో, ప్రధానంగా యువకుల్లో, తలెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే బిసిల సాధికారత కోరుకుంటున్న తెలంగాణా ఉద్యమకారులు, బిసి ఉద్యమాల్లో, హక్కుల ఉద్యమాల్లో, ఉద్యోగుల, కార్మికుల, రైతుల ఉద్యమాల్లో వృత్తిదారుల, ఉపాధ్యాయ ఉద్యమాల్లో పాల్గొన్నవారు, అదే విదంగా బిసి రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు అడ్వకేట్స్, డాక్టర్లు ఇంకా వివిధ రంగాల్లో అనేక సమస్యలకు, బాధలకు గురవుతున్న బిసి విద్యార్థులు, నిరుద్యోగులు, సీనియర్ సిటిజన్లు, నెటిజన్లు ఇంకా అనేక మేధావులు గత కొద్ది కాలంగా తీవ్రమైన 'అలజడికి' గురౌతున్నారు. వారి 'మెదళ్లలో జరుగుతున్న సంఘర్షణ ఫలితంగా' తెలంగాణాలో చెలరేగుతున్న ఈ **'అంతర్గత వివక్షను'** వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని కోరుకోవడం ఇప్పుడు జరుగుతున్న పరిణామాల్లో గమనించదగిన విషయం. రాజ్యాంగమిచ్చిన తమ హక్కుల పరిరక్షణకు, పాలనలో తమ భాగస్వామ్యానికి, తెలంగాణా ఉద్యమంలోని తమ ఆకాంక్షల సాధనకు అందరూ మళ్ళీ సమిష్ఠిగా ఉద్యమాలను నిర్మించటానికి అవసరమైన వేదికల ఏర్పాటు అవసరమని భావించడం జరిగింది. ఆ క్రమంలోనే వివిధ స్థాయిల్లో జరిపిన చర్చల ఫలితంగా తమకంటూ నూతనంగా ఒక **'రాజకీయ ఉద్యమ వేదిక'** ఉండాలని కోరుకోవడం జరిగింది. ఆ క్రమంలోనే వారు ఐఖ్యంగా, ఏక లక్ష్యంగా, అవసరమైతే దీర్ఘకాలిక 'రాజకీయ ఉద్యమాలను' నిర్మించాలన్న ఆకాంక్షతో నూతన వేదిక ఆవిష్కరణ జరగాలని కోరుకోవడం జరిగింది.

నూతనంగా మనం నిర్మించుకోబోయే బిసి రాజకీయ ఉద్యమ వ్యవస్థ ఏ రూపంలో ఉంటే నిర్ణయాత్మకంగా ఉండే అవకాశముందో కొన్ని ప్రతిపాదనలు పరిశీలిద్దాం. ఆలోచన – అధ్యయనం – సంఘటితం, నిర్నీత లక్ష్యసాధనకు సమిష్టి ఉద్యమాలు నిర్మించడం, అనుకున్న లక్ష్యాన్ని సాధించడం ప్రాతిపదికగా మనం ప్రతిపాదించబోయే సంస్థను

నిర్మించుకుంటూ, సభ్యత్వాన్ని విస్తరించుకోవాల్సి ఉంటుంది. చరిత్రను ముందుగా తెలుసుకోవడం, సమాచారం సవివరంగా అందుబాటులో ఉంచుకోవడం, సమస్యలపట్ల పూర్తి అవగాహన కలిగి ఉండడం, తగిన విశ్లేషణ చేయడానికి సమావేశాలు, చర్చలు, సంప్రదింపులు కొనసాగిస్తూ **బిసిలకు నష్టం కలిగించిన, కలిగిస్తున్న ప్రతీ సమస్యను** ఎత్తిచూపుతూ ప్రతీ అంశంపై **ప్రశ్నించే తత్వం** అలవర్చుకోవాల్సి ఉండడంతోపాటు, మనతో ఉన్న అందరి దృష్టికి అన్ని విషయాలను సమగ్రంగా తీసుకురావడం, అందుకు సంబంధించి లభించిన **పూర్తి సమాచారం పంచుకోవడం**, సమస్యల పరిష్కారానికి **ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటూ** మనమంతా సంఘటితంగా ఉద్యమాలు నిర్వహించడానికి ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ముందుగా మనం ఇక్కడ దేశవ్యాప్త, రాష్ట్ర వ్యాప్త కనీస విషయ ప్రస్తావనతోపాటు, ప్రస్తుత దశలో కొనసాగుతున్న బిసి ఉద్యమ స్థాయిని సంక్షిప్తంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

**1)** భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు కావస్తుంది. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు "ఆజాదీకా అమృత్ మహోత్సవ్" పేరుతో 75 వారాలపాటు అత్యంత వైభవంగా ఈ సంబరాలను ఓ పండుగలా జరపాలని చర్యలు తీసుకుంటున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఓ అడుగు ముందుకు వేసి 75 కోట్లు కేటాయించి తనవంతుగ పెద్దఎత్తున సంబరాలకు పూనుకున్నది. అయితే ప్రభుత్వాల మాట అటుంచితే, ప్రజలకు సంబంధించినంత వరకు అందరూ ఒకేలా సంబరాలు జరుపుకునే పరిస్థితిల్లో లేరు. క్రెడిట్ స్యూజ్ నివేదిక ప్రకారం ప్రస్తుతం దేశంలో పది లక్షల డాలర్లకు పైగా సంపద కలిగిన వారిలో పై భాగంగా ఉన్న ఒక శాతం కుటుంబాలు మొత్తం దేశ సంపద – ఆదాయాల్లో 50 శాతంపైగా తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నట్లు పేర్కొంది. అందువల్ల వారు సహజంగానే ఈ సంబరాలకు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. అందుకు భిన్నంగా జనాభాలో అత్యధిక సంఖ్యాకులు ప్రధానంగా మనకు సంబంధించినంతవరకు మన బిసి కులాలు స్వాతంత్ర్యం తరువాత కూడా జరిగిన అభివృద్ధి ఫలాలు కనీస స్థాయిలో అందక అనేక సమస్యలతో సతమతమవుతూ ఉండడం వల్ల వారికిది సహజంగానే ఒక పండుగలా అన్పించట్లేదు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరినుండి వేసిన 'ప్రగతి ప్రణాళికలు', చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఖర్చు చేసిన అనేక లక్షల కోట్ల రూపాయలు వల్ల కల్గిన ప్రయోజనాలు సమాజంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలకు "లక్ష్య ప్రకటన" చేసిన విధంగా ఒకే మాదిరిగా అందలేదు. స్వాతంత్ర్యానికి ముందు ఎలాగైతే ఉన్నత సామాజిక హోదాను, అధికారాన్ని, అభివృద్ధిని అనుభవించిన కొన్ని కులాలకు చెందిన ప్రజలు, స్వాతంత్ర్యం తరువాత కూడా అదే క్రమంలో వారు మరింత హోదాను, మరింత తిరుగులేని అధికారాన్ని, మన కళ్లకు కూడా ప్రస్ఫుటంగా కనపడే అమోఘమైన అభివృద్ధిని సాధిస్తే, తరతరాలుగా దోపిడీకి, పీడనకు గురైన కింది కులాల ప్రజలు నిరంతర వివక్షకు, అవమానాలకు, అసమానతలకు, అనభివృద్ధికి గురవుతూ, మరింత కిందకు దిగజారిపోయే పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

ఒకప్పుడు ప్రణాళికా సంఘం చెప్పిన విధంగా సగటు మానవుడికి కావాల్సిన **'పౌష్టికాహారం'**, పరిసరాల శుభ్రత కలిగిన **'గృహవసతి'**, స్వచ్ఛమైన **'తాగునీరు'**, ఏడాది పొడుగునా ఆదాయాన్ని అందించే **'ఉపాధి', 'విద్య', 'ఆరోగ్యం'** లాంటి కనీస అవసరాలు తీరి గౌరవప్రదమైన జీవితం గడిపే అవకాశం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బిసిలకు ఇన్నాళ్లకైనా ఎందుకు లభించలేదు అన్నది సమాధానం దొరకని ప్రశ్న? వాస్తవానికి సంప్రదాయ వృత్తుల విధ్వంసం వల్ల బిసిలు

ఉపాధి కోల్పోయి, అప్పులపాలై కుటుంబాలు విచ్ఛిన్నమై ప్రత్యామ్నాయం లేక దూరప్రాంతాలకు వలసలకు పోవడం అవిచ్ఛిన్నంగా కొనసాగింది. ఆకలిచావులకు, ఆత్మహత్యలకు పాల్పడే వారిలో 70% పైగా బిసిలని అధ్యయనాలు చెప్తున్నాయి. ప్రభుత్వాలు ఈ అంశాన్ని అస్సలు పరిగణలోకి ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదో ప్రశ్నించాల్సి ఉంది?

అదే విధంగా మౌలిక ఉత్పత్తి వనరులైన భూమి, ఇతర ప్రకృతిసిద్ధ వనరులు, వ్యవసాయం, పరిశ్రమలు, ఉత్పత్తి – పంపిణీ, మార్కెట్లు, వ్యాపార, వాణిజ్యాలు, సాంకేతిక వ్యవస్థలు, బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ సంస్థలు, కాంట్రాక్టులు, విద్య, వైద్యం మొదలగు సర్వీసు రంగాలు, ఐటి, సమాచార, సాంకేతిక వ్యవస్థలు, మీడియా, సినిమా, ఇతర ఎంటర్టైన్మెంట్ రంగాలు, టూరిజం – హోటల్ – హాస్పిటాలిటీ రంగాలు – ఇలా చెప్పుకుంటూపోతుంటే అనేక నూతన ఆర్థిక, సాంకేతిక వ్యవస్థలు 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశం ఎవరి చేతిలో పెట్టిందో గమనించాలి? అందులో బిసిల వాటా ఎంత? అన్న విషయాలు పరిశీలించి, అలా ఉండటానికి కారణాలేమిటో మనం తెలుసుకుని విశ్లేషించి ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. అదే విధంగా ప్రభుత్వ విధానాల వల్ల బిసిలకు జరిగిన నష్టం ఏమిటి? ఈ విదానాలు ఏ కులాలకు, ఏ స్థాయిలో ఉపయోగపడ్డాయో, అలా ఎందుకు జరిగిందో కూడా విశ్లేషించాల్సిన అవసరముంది?

అదే క్రమంలో రాజ్యాధికార వ్యవస్థలు, అసెంబ్లీలు, మండళ్లు, పార్లమెంట్ వ్యవస్థలు, కమిటీలు, కమీషన్లు, రాజకీయ పార్టీలు ఇంకా అనేక కార్యనిర్వాహక శాఖలు ఇతరత్రా ఎవరి చేతుల్లో కేందీకృతమై ఉన్నాయి? ఎందుకలా ఉన్నాయి? అందులో మన వాటా ఎంత? అదే విధంగా ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ, కేంద్ర, రాష్ట్ర అత్యున్నత సర్వీసు ఉద్యోగాలు, న్యాయాధీశులు మొదలగు వారిలో బిసిల శాతమెంత? అగ్రకులాల శాతమెంత? 70 శాతంకు పైగా ఉన్నత పదవుల్లో అగ్రకులాల వారే ఎందుకుంటారు? ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ సంస్థల్లో అనేక కేంద్ర విద్యా సంస్థల్లో అడ్మిషన్లు, ఫ్యాకల్టీ నియమాకాల్లో ఇప్పటికీ రిజర్వేషన్లు అమలు చేయకపోవడం దారుణం. ప్రధానంగా ఐఐటి, ఐఐయం లాంటి విద్యాలయాల్లో విద్యార్థులు, అధ్యాపకుల్లో అసలు బిసిల శాతమెంత? అందులో ఎంత శాతం విద్యను పూర్తిచేసి బిసిలు ఉన్నత పదవులు అలంకరిస్తున్నారు? విద్యను మధ్యలో ఎందుకు వదిలేస్తున్నారు? **అలాంటి సంస్థలన్ని "అగ్రకులాల అగ్రహారాలుగా" ఎందుకు మారిపోయాయో** ఇప్పటికైనా మనం ప్రశ్నించాల్సిన అవసరముంది? రిజర్వేషన్లు అమలుచేస్తున్నామన్న ప్రభుత్వాలకు ఈ విధమైన అసమానతలు ఎందుకు కనిపించవు? పైగా క్రిమిలేయర్, 50 శాతం సీలింగ్, ప్రమోషన్లలో రిజర్వేషన్లు లేకపోవడం, చట్టసభల్లో రిజర్వేషన్లు లేకపోవడం, వీటన్నింటి దృష్ట్యా బిసిలు, ఈ విషయాల్లో ఎస్సీలకన్నా దామాషాలో వెనుకబాటులో ఉన్న నగ్న సత్యాన్ని ఎందుకు గ్రహించరు? మరి బిసిలు కూడా ఈ విషయాల గురించి సీరియస్‌గా ఎందుకు పరిశీలించరు? ఇలా అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో బిసిల స్థితిగతుల విషయంలో మనం లెక్కలు తీయాల్సిన అవసరముంది? బిసి కులాల జనాభా వివరాలు చేపట్టాలని సుప్రీం కోర్టు, బిసి కమీషన్లు పదే పదే చెప్పినప్పటికి కేంద్రం కుల జనాభా గణన చేయడంలో ఎందుకు జాప్యం చేస్తుందో, దీని వెనుక వున్న కుట్రలేందో బహిర్గతం చేయాల్సిన అవసరముంది? ఇలా 2021 జనాభా గణన ప్రారంభమైన తర్వాత కూడా **కుల గణన చర్యలు చేపట్టకపోవడాన్ని ప్రశ్నించాలి?** ఈ విదంగా ఇంతకాలంగా ఏ స్థాయిలో కూడా ప్రభుత్వాల ప్రాధాన్యత క్రమంలో బిసిలు లేరన్నది సుస్పష్టం.

**2)** తెలంగాణ విషయానికొస్తే, దీర్ఘకాలిక ఉద్యమాల ద్వారా ఏర్పడ్డ ఈ రాష్ట్రంలో ఆదినుండే ఉద్యమ ఆకాంక్షలకు భిన్నంగా నడిచే ప్రభుత్వ పాలన కొనసాగుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాదిరిగానే తెలంగాణ కూడా అగ్రకులాల చేతిలో బందీ అయ్యింది. దాంతో పాటు కుటుంబ పాలన, పెత్తందారితనం, అవినీతి, ఆశ్రితపక్షపాతం, ఆర్థిక విశృంఖలత్వం, సామాజిక దోపిడీ నిరాటంకంగా కొనసాగుతున్నాయి. ఉద్యమంలో పెద్దఎత్తున పాల్గొన్న బిసి కులాలు అధికారానికి, అభివృద్ధికి దూరంగా ఉంచబడి అణచివేతకు నిరంతరంగా గురవుతూనే ఉన్నారు. వాస్తవానికి తెలంగాణా ఉద్యమ కాలంలోనే ప్రధాన స్రవంతి ఉద్యమ నాయకత్వం అగ్రకులాల చేతుల్లో ఉండిపోవడం వల్ల, బిసి సామాజిక వర్గాల నుండి నాయకత్వం ఎదిగే క్రమానికి అడ్డుకట్ట పడింది. ఉద్యమ నాయకత్వం మొదటినుండీ **సామాజిక తెలంగాణా నినాదాన్ని పక్కన పెట్టి** అగ్రకులాలకు ఉపయోగపడే అజెండాను నొక్కిచెప్తూ వచ్చింది. అయినా ఉద్యమాల్లో పెద్దఎత్తున్న పాల్గొన్న బిసిలు తమ స్వంత అస్థిత్వాన్ని కూడా పక్కన పెట్టి స్వలాభాపేక్ష లేకుండా ఉద్యమంలో చిత్తశుద్ధితో పాల్గొనడం జరిగింది. కాని, ఎన్నికల వాగ్దానాలకు భిన్నంగా, తెలంగాణ ప్రభుత్వం **మొదటి నుండే బి.సి. వ్యతిరేక ధోరణిని అవలంభిస్తూ వచ్చింది**. టికెట్లు ఇవ్వడం దగ్గరనుండి నామినేటెడ్ పదవుల పంపిణి వరకు బిసిలకు మొండిచెయ్యి చూపెట్టింది. ప్రజల అవసరాలకు ఉపయోగపడే వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, వాటి విధ్వంసం యదేచ్ఛగా కొనసాగించింది. ఆ క్రమంలోనే బిసి కమీషన్‌ను కూడా బొందపెట్టింది. యంబిసి కార్పొరేషన్‌ను అపహాస్యం పాలు చేసింది. సంచార జాతులను రోడ్డు పాలు చేసింది. అసలు సమస్యలను పక్కన బెట్టి కులాల ఆత్మగౌరవ బిల్డింగులని జివోలు తీసి బిసిలను తమ చుట్టూ గిరగిరా తిప్పుకోవాలని చూసింది. బిసిల జనాభా గణన పేరుతో చేపట్టబడిన **'సమగ్ర కుటుంబ సర్వే'** నివేదికను చెత్తబుట్టలో వేసింది. బిసి కార్పొరేషన్, ఫెడరేషన్లకు నిర్వాహణ కమిటీలు వేయకుండా, వాటికి సరిగ్గా నిధులు కేటాయించకుండా, కేటాయించిన నిధులు విడుదల చేయకుండా, చివరికి వారికిచ్చే లోన్లను, సబ్సిడీలను గత మూడు సంవత్సరాలుగా నిలిపివేసింది. తెలంగాణ వచ్చాక గడిచిన ఎనిమిది వార్షిక బడ్జెట్‌లలో బిసిలకు రెండు శాతం నిధులనే వెచ్చించింది. నిధుల కొరకు అంగలార్చే పరిస్థితి సృష్టించింది. బిసి సబ్‌ప్లాన్ అమలు చేస్తామని హామీ ఇచ్చి కూడా అమలు చేయకపోవడం బిసిలకు చేసిన మరో అన్యాయం. **'కేజి – టూ– పిజి ఉచిత విద్య'** అన్నది అమలుకు నోచుకోలేదు. ఒకవైపు ప్రభుత్వ విద్యా సంస్థలు నిర్వీర్యమై విధ్వంసం చేయబడితే, మరోవైపు ప్రయివేట్ విద్యాసంస్థలు రాజ్యమేలుతున్నాయి. చదువు కొనుక్కొలేని అనేక బిసికులాలు విధ్యను అర్థాంతరంగా ముగించాల్సి వస్తుంది. నాణ్యమైన ఉన్నత విద్య వారికి కలగానే మిగిలిపోయింది. స్కాలర్‌షిప్‌లకు, హాస్టళ్లకు ప్రతీసారి 'అడుక్కుతినే' పరిస్థితిని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే తెలంగాణ వచ్చిన తరువాత కూడా వృత్తి కులాల వారు, నిరుద్యోగులు ఇంకా ఎంతో మంది ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారో మనం అర్థం చేసుకోవాల్సిన అవసరముంది? రిజర్వేషన్లకు ప్రతిచోటా తూట్లు పొడిచి స్థానిక సంస్థల్లో వాటిని తగ్గించే ప్రయత్నాలు చేస్తూ ఇలా అనేకంగా బిసి వ్యతిరేక ధోరణులకు కూడా తెలంగాణా ప్రభుత్వం పాల్పడింది. ఈ విధంగా జనాభాలో 90 శాతం పైగా ఉన్న బిసిలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, పది శాతం కూడా లేని అగ్రకులాలలకు దాసోహం కావడం జరిగింది. సంక్షేమం పేరుతో తెలంగాణ ప్రభుత్వం బిసి సామాజిక వర్గాలను కట్టి పడేసి అప్పుడప్పుడు బిచ్చం వేస్తే సరిపోతుందని తమ చెప్పుచేతుల్లో ఉంచుకుంటూ, వారిని

పరాన్నజీవులుగా మార్చే ప్రక్రియలు ఇంకా నిరంతరంగా కొనసాగుతూనే ఉన్నాయి. బిసి మంత్రులు, చట్టసభల్లోని సభ్యులు ప్రగతిభవన్, అసెంబ్లీ, పార్లమెంట్ భవనాల ముందు **'వేలాడదీయబడ్డ దిష్టి బొమ్మల్లా'** మిగిలిపోయి అధికారానికి ఊడిగం చేయడానికి మాత్రమే పనికొస్తారని నిరూపించడం జరిగింది. గందర్‌ఫ్రాంక్ అన్న శాస్త్రవేత్త వేరే సందర్భంలో చెప్పినట్లు ప్రస్తుతం తెలంగాణలో ఒక విధమైన లుంపెన్ ప్రభుత్వం, లుంపెన్ పాలన, లుంపెన్ అభివృద్ధి కొనసాగుతుండడం వల్ల బలహీన సామాజిక వర్గాల పరిస్థితి సమైక్య రాష్ట్రంలోకన్నా హీనంగా తయారైంది.

**3)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో బిసి ఉద్యమం ఎప్పుడూ వేళ్లూనలేదు. బిసి ఉద్యమాల పేరుతో ఏర్పడ్డ బిసి సంఘాలు, కులసంఘాలు కొన్ని సంక్షేమ కార్యక్రమాల విషయంలో విజయం సాధించినప్పటికీ అవి ఆచరణలో వ్యక్తుల కేంద్రీకృతంగా నడిచే వ్యవస్థలుగా రూపొంది, కొనసాగడంవల్ల ఈ ప్రాంతంలో బిసి ఉద్యమ వ్యాప్తి దళిత ఉద్యమాల మాదిరిగా సిద్ధాంతపరంగా, వ్యవస్థీకృతంగా అభివృద్ధి చెందలేదు. ఈ దోరణికి అనేక కారణాలున్నప్పటికీ, వాస్తవంలో ప్రస్తుతం బిసి ఉద్యమం అత్యంత బలహీన దశలో ఉండిపోయింది. చాలా మంది బిసి నాయకులు 'మీడియా టైగర్లుగా' మిగిలిపోయారు. ప్రభుత్వాలు వారిని సులభంగా విడదీసి, గిరిగీసి వాటి నాయకులకు తమ చుట్టూ గిరగిరా తిప్పుకుంటూ బిసిలనందర్నీ తమకు అనుకూలంగా మల్చుకోవచ్చు అన్నది వాస్తవంగా మిగిలింది. అందువల్ల ఈ ప్రాంతంలో జరిగిన బిసి ఉద్యమానికి ఒక శాస్త్రీయమైన ప్రాతిపదికకానీ, బలమైన భావజాలం కానీ, నిబద్ధత కల్గిన నాయకత్వం కానీ నిరంతరణ ప్రణాళికగానీ లేకుండా పోయింది. వివిధ బిసి కుల సంఘాలకు తమ తమ కులాల 'పరిమిత చైతన్యమే' ప్రాతిపదికగా ఉండటం వల్ల, కొన్ని రాయితీల సాధన తప్ప అవి విడిపోయి విడివిడిగా ఉంటూ పాలకులకు అనుగుణంగా ఇతర బిసి నాయకులను విమర్శించుకుంటూ, చివరికి రాజ్యాంగం బిసిలకు కల్పించిన చట్టబద్ధ హక్కులను కూడా అనుభవించే స్థితిలో లేకుండా మిగిలిపోవడం షరామామూలైంది. **సమగ్ర బిసి కులాల రాజకీయ చైతన్యం లోపించి, 'విడివిడి కులచైతన్యంగా' విడిపోవడం వల్ల ఏర్పడిన 'సంకుచిత చైతన్యం', అటు తమ కులానికి కానీ లేదా ఇటు బిసి కుల – వర్గానికి కానీ, ఏమాత్రం ఉపయోగపడని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి నుండి బయటపడితే తప్ప బిసి ఉద్యమ నిర్మాణం రూపొందే క్రమం ఏర్పడదు. అందువల్ల బిసి సమగ్ర చైతన్యం రూపుదిద్దుకోవాలంటే శాస్త్రీయమైన ప్రాతిపదికపైన నూతన బిసి ఉద్యమ సంస్థల నిర్మాణం జరగాల్సిందే !** ఇది చారిత్రక సత్యం, పూలే, అంబేద్కర్ కోరుకున్నది అదే.

**4) నూతన బిసి ఉద్యమ వ్యవస్థల నిర్మాణానికి మనమంతా తప్పనిసరిగా ఈ కింద పేర్కొన్న అంశాలపై దృష్టి సారించాల్సి ఉంటుంది.**

అ) స్వంత సామాజిక అస్తిత్వ నిర్మాణం.

ఆ) స్వంత ఉమ్మడి బిసి గుర్తింపు నిర్మాణం.

ఇ) ప్రతీ అంశం బిసి కోణం, బిసి సోయి, బిసి దృక్పథం నుండి పరిశీలించి అర్థం చేసుకోవడం

ఈ) బిసి కులాల ఉమ్మడి చైతన్య నిర్మాణం.

ఉ) బిసివాద సిద్ధాంత అవగాహన కలిగి ఉండడం.

ఊ) ప్రజాస్వామ్య విలువలు – చివరి బిసి కులాలను కూడా సమాన స్థాయిలో గౌరవించడం.

ఎ) వివిధ కులాల మధ్య ఉన్న అంతర్గత వైరుధ్యాల – అంతరాల పట్ల సంపూర్ణ శాస్త్రీయ అవగాహన, ఆ విషయాల పట్ల వాస్తవ దృక్పథం – వైరుద్యాల పరిష్కార దిశగా చర్యా ప్రణాళిక రూపకల్పన – ఆచరణ.

ఏ) బిసి ఉద్యమ దీర్ఘకాలిక లక్ష్యం – రాజకీయ దృక్పథం – విధాన రూపకల్పనపై ప్రత్యేక శ్రద్ధ.

ఐ) నూతనత్వం, అంతర్గత 'సోషల్ రి ఇంజనీయరింగ్' ప్రాతిపదికగా స్వతంత్ర ప్రత్యామ్నాయ రాజకీయ దృక్పథ రూపకల్పన.

ఒ) అగ్రకులాల 'ఆదిపత్యం – అధికారం – అభివృద్ధి' పట్ల పూర్తి చారిత్రక అవగాహన – అదేవిధంగా అగ్రేతర లేదా బిసి కులాల్లో వచ్చిన మార్పులపట్ల సరియైన అంచనా, అవగాహన, చాలా ముఖ్యం. అది అర్థం అయినప్పుడే అన్ని రంగాల్లో మారుతున్న ప్రాపంచిక పరిస్థితులు, ప్రధానంగా మన వెనుకబాటుతనానికి కారణమవుతున్న పరిస్థితులపట్ల చారిత్రక అవగాహన కలుగుతుంది. **ఎల్‌పిజిల ప్రభావం కూడా బిసిలపై ఏ విధంగా ఉందో సమగ్ర అవగాహన కావాలి.** పరిస్థితులకు అనుగుణంగా మనం ఏ విధంగా మార్పు చెందాలో కూడా మనం నిర్ణయించుకోవాల్సి ఉంది.

ఓ) ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంబందిత విషయాల్లో సమగ్ర అవగాహన, **వారితో ఉండాల్సిన మిత్రవైరుధ్య అవగాహన – రాజకీయ వ్యూహంగా వైరుధ్యల పరిష్కారం – అలయన్సుల ఏర్పాటు తప్పనిసరి.**

ఔ) సామాజిక కోణంలో బిసి కులాల మధ్య ఉన్న వైరుధ్యాల పరిష్కారం, శత్రు – మిత్ర వైరుధ్యాల మధ్య ఉన్న తేడాపట్ల ఆచరణలో అవగాహన.

అం) సమానత్వం కలిగిన, మచ్చలేని, నిబద్ధత కలిగిన యువ నాయకత్వ నిర్మాణం – సమిష్ఠి నాయకత్వంపై నమ్మకం.

క) వివిధ స్థాయిల్లో అనేక నెట్‌వర్కుల నిర్మాణం – పని విభజన – సమన్వయం – దూరదృష్టి – పరిధుల విస్తరణ సామర్థ్యాన్ని పెంచుకోవడం – కేంద్ర కార్యాలయంలో **'బిసి రిసోర్సు సెంటర్ – కాల్ సెంటర్స్'** ఏర్పాటు.

ఖ) సామాజిక మాధ్యమాల విస్తృత వినియోగం – ఫేస్ బుక్, ట్విట్టర్, వాట్స్ అప్ మొదలగు వాటి విస్తృత వినియోగం.

గ) బిసి వెబ్ కాస్టింగ్ – యు ట్యూబ్ చానళ్ల ఏర్పాటు – వాటి విస్తృత వినియోగం. అదే విధంగా ప్రత్యేకమైన వెబ్‌సైట్ రూపకల్పన, అవసరమయ్యే బ్లాగులను ఏర్పాటుచేసుకుంటూ ఆన్‌లైన్ న్యూస్‌లెటర్స్‌ను ప్రచురించడం.

ఘ) కోవిడ్ సమయంలో అత్యవసర సమయాల్లో అవసరమైతే ఆన్‌లైన్ సమావేశాలు – చర్చలు జరగాలి.

ఙ) పై అంశాలతోపాటు ఇంకా కావాల్సినవి ఎంచుకొని సమగ్ర దృక్పథంలో ముందుకు కదలాల్సి ఉంది.

**5)** అదే క్రమంలో పై వాటితోపాటు:

ఎ) **బి.సి. పొలిటికల్ ఫ్రంట్** నిర్మాణానికి ఒక బలమైన 'గుర్తింపు చిహ్నం' ఒక "ఐకాన్" లేదా "సింబల్"ను లేదా 'ఇమేజ్'ను ఎంపిక చేసి మన సంస్థకు ప్రత్యేక గుర్తింపుగా ప్రచారం చేయాల్సి ఉంటుంది. ఆ క్రమంలోనే ఒక "జెండా"ను రూపొందించుకోవాలి. బిసి కులాల సామాజిక శక్తిని అవి ప్రతిబింబింపజేసేలా ఉండాలి. తగిన నినాదాలను

రూపొందించుకోవాలి. అదే విదంగా స్థిరమైన క్రమశిక్షణ కలిగిన స్థిరమైన బిసి ఉద్యమకారుల వ్యవస్థను రూపొందించుకోవాలి. ఈ వ్యవస్థ పట్టణప్రాంతాల నుండి గ్రామీణ ప్రాంతాలకు విస్తరించే విదంగా ఉండాలి. ప్రతీ గ్రామంలో మనకంటూ వేదిక ఉండాలి.

బి) **బి.సి. పొలిటికల్ ఫ్రంట్** నిర్మాణానికి ఒక చారిత్రక – సైద్ధాంతిక – ప్రాతిపదికను రూపొందించుకోవడానికి వీలుగా మహాత్మాజ్యోతిరావుపూలే రచించిన "గులాంగిరి"ని ఎంపిక చేసుకొని అందరిచే చదివించాలి. నూతన నిర్మాణంలో భాగంగా సభ్యులందరిచే 'పుస్తక పఠనం' – సమాచార సేకరణ – విశ్లేషణ అంశాలను మన జీవితంలో, మన ఉద్యమంలో ఒక అంతర్భాగంగా రూపొందించుకోవాలి. అదే విదంగా ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి. **'గులాంగిరితో'** పాటు మరికొన్ని గ్రంథాలను కూడా ఎంపిక చేసుకోవాలి. ప్రధానంగా 'ఊసా' రచించిన **'బిసి మానిఫెస్టో',** కొండలరావుగారు రచించిన **'బిసివాదం',** అనేక అంశాలపై జరుగుతున్న పరిస్థితులను అంచనా వేయడానికి పావని నాగరాజు ఎడిట్ చేసిన **'కుల వ్యవస్థ – బిసి సమస్య'**, అదేవిధంగా **'వరంగల్ బిసి డిక్లరేషన్'** డాక్యుమెంట్ మొదలగు వాటిని అందరూ తెలుసుకునే విధంగా ప్రచారం చేయవచ్చు.

సి) **బి.సి. పొలిటికల్ ఫ్రంట్** నిర్మాణానికి స్పష్టమైన, ఆచరణాత్మకమైన 'అజెండా' ఉండాలి. అది దీర్ఘకాలిక అజెండాతో పాటు, 'స్వల్పకాలిక లక్ష్యసాధనఅజెండా'గా కూడా ఉండాలి. స్పష్టమైన ప్రాధాన్యతలను'ను నిర్ధారించి ముందుకుసాగాలి. బిసిల చైతన్య స్థాయి పెంపొందించే స్పష్టమైన క్రమాన్ని నిర్దేశిస్తూ కనీస డిమాండ్ల సాధనకు ఉద్యమిస్తూ, పట్టణ ప్రాంతాల నుండి గ్రామీణ ప్రాంతాల వరకు అన్ని స్థాయిల్లో 'ఆచరణ కమిటీ'ల ఏర్పాటు చేసుకొని 'టార్గెట్ 2023 లక్ష్యంగా పనిచేయాలి. దీనికి నిరంతర అధ్యయనం ఆలోచన ఆచరణ అవసరం. సంఘటితంగా రాజకీయ ఉద్యమాలను నిర్మించడం అవసరం.

**6) నూతన నిర్మాణానికి ఒక పటిష్టవంతమైన వ్యవస్థ – సమిష్టి సారథ్యం అవసరం.** ముందుగా (ఎ) అడ్వయిజరీ కమిటీ (బి) కోర్ కమిటీల ఏర్పాటు చేసుకోవాలి. (సి) విస్తృత కార్యనిర్వహక మండలి రాష్ట్ర స్థాయిలో ఉండాలి. (డి) జిల్లా కమిటీలు (ఇ) నియోజకవర్గ కమిటీలు (ఎఫ్) మండల్ కమిటీలు (జి) గ్రామ కమిటీలు (హెచ్) వివిధ ప్రొఫెషనల్ గ్రూపులకు ప్రత్యేక కమిటీలుండాలి. (ఐ) స్త్రీలకు ప్రత్యేక కమిటీ – అంతేకాకుండా అన్ని కమిటీల్లో స్త్రీలకు ప్రత్యేక స్థానం ఉండాలి. (జె) విద్యార్థులకు కమిటీ (కె) యువకులకు, నిరుద్యోగులకు కమిటీలుండాలి. (ఎల్) ఓవర్సీస్ కమిటీ ఉండాలి. (యం) కేంద్ర స్థాయిలో ఒక 'పరిశోదన' కమిటీని ఏర్పాటు చేసి బిసిలకు సంబందించిన అన్ని అంశాల్లో సమగ్ర అధ్యయనాలను చేపట్టాలి. ఈ సందర్భంగా హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో విస్తృత సమావేశాలు అన్ని స్థాయిల్లో నిర్వహించి వీటన్నింటిని రూపొందించాలి. గ్రామం నుండి – మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు స్థానిక, ప్రాంతీయ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కొరకు సమిష్టి దృక్పథంతో రాజకీయ కార్యాచరణ కార్యక్రమాలను రూపొందించి అమలుచేయాలి. మన ఆచరణ సామర్థ్యాన్ని మనమే మెరుగుపర్చుకుంటూ ముందుకు సాగాలి.

**7) మనకంటూ మనమే స్వంత ఆర్థిక వనరులను రూపొందించుకోవాలి.** అందులో (ఎ) సభ్యుల నుండి తప్పనిసరిగా సమకూర్చవల్సినవి. (బి) డొనేషన్ల రూపంలో సమకూర్చవల్సినవి (సి) వస్తురూపంలో (డి) కార్యక్రమ ఖర్చు భరించే

దాతల రూపంలో (ఇ) పే – బ్యాక్ రిజర్వు ఫండ్ రూపంలో (ఎఫ్) క్రౌడ్ ఫండ్ రూపంలో – ఒక్కొక్కరి నుండి కనీసం 50 రూపాయలు లేదా వారి స్థాయిని బట్టి ఇచ్చే రూపంలో నిధులను సమకూర్చుకోవాలి.

**8)** సమగ్ర కార్యాచరణ రూపొందించుకోవడానికి:

ఎ) జూన్‌లో హైదరాబాద్ లో సమావేశం – వీలైతే హైదరాబాద్ లో కార్యాలయం ఏర్పాటు.

బి) తెలంగాణ జిల్లాల్లో ఇప్పటినుండే చిన్న చిన్న సమావేశాలు, సభ్యులను చేర్చుకోవడం – జిల్లా స్థాయి కార్యాలయాల ఏర్పాటు. మన సభ్యత్వాన్ని ప్రతీస్థాయిలో రూపొందించుకోవాలి. అందులో బిసిలకు సంబందించి అన్ని కులాల నుండి సభ్యత్వాలను సేకరించి సమావేశాలను నిర్వహించాలి. ఒకొక్క జిల్లాల్లో ఎన్ని బిసి కులాలు ఉన్నాయో అధ్యయనం చేసి, ఆయా జిల్లా కమిటీల్లో అన్ని కులాల వారికి ప్రాతినిధ్యమియాల్సి ఉంటుంది.

సి) అన్ని జిల్లా సమావేశాల తరువాత హైదరాబాద్ లో పూర్తి స్థాయి సమావేశం ఏర్పాటుచేయాలి.

డి) అన్ని స్థాయిల్లో అన్ని అంశాలపై శిక్షణా తరగతులను నిర్వహించడం. ఆలోచనలను మెరుగుపర్చుకుంటూ చైతన్యస్థాయిని పెంపొందించుకోవడం.

ఇ) ముందుగా అన్ని స్థాయిల్లో కమిటీలు ఏర్పాటుచేసిన తర్వాత అన్ని జిల్లాల్లో బిసి చైతన్యయాత్రలు – పాదయాత్రలు లేదా బస్ యాత్రలు నిర్వహించాలి. దీనికి ముందు బిసి మేధావులు, ప్రొఫెషనల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపార సంస్థలు, మహిళా సంఘాలు, స్వచ్చంధ సంస్థలు, కుల సంఘాలు, వృత్తి సంఘాలు, బిసి సంఘాలు, ఎంబిసి సంఘాలు, సంచార జాతుల సంఘాలు, తెలంగాణ బిసి ఉద్యమకారుల సంఘాలు, బిసి ప్రజాప్రతినిధుల సమావేశాలు ఏర్పాటుచేసుకుంటూ పోవాలి. విడివిడిగా వారితో కలిసి వివిధ స్థాయిల్లో సంస్థాగత నిర్మాణాలు ఏర్పాటుచేసి నిరంతర సమావేశాల ద్వారా సంఘటిత పర్చాలి.

**9) ఒకవైపు బిసి చైతన్య కార్యక్రమం – మరో వైపు వివిధ బిసి కులాల మధ్య ఐక్యత నెలకొల్పుతూనే అందర్నీ సంఘటితపర్చే** అవకాశాలను ఉపయోగించుకొని, ఆయా కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యల పైన, కీలక అంశాలపైన సమగ్ర చర్చ జరిపి ప్రత్యేక నివేదికలను రూపొందించి వాటి ఆచరణకు ప్రణాళికాబద్ధంగా రాజకీయ ఉద్యమాలు నిర్వహిస్తూ బిసిలందర్నీ “రి ఎడ్యుకేట్ – రి డెడికేట్” చేసే కార్యక్రమాలను నిర్వహించాలి. **ప్రతి సందర్భం బిసిల ఆత్మగౌరవసాధన, బిసిల సాధికారత, బిసిల రాజ్యాధికార ధ్యేయంగా వినియోగించి** ఆ కోణంలో రాజకీయ ప్రక్రియల ద్వారా ఆచరణలో నిర్ధారించిన లక్ష్యాలను చేధించాలి.

చివరగా, పై అంశాలన్నీ దృష్టిలో పెట్టుకుని స్పష్టమైన చారిత్రక అవగాహనతో ముందుకుసాగాలి. ఈ ప్రక్రియలన్నీ సమిష్ఠి తత్వంతో ఒక మహాయజ్ఞంగా నిర్వహించాలి. ఆర్థికంగా – రాజకీయంగా – కులపరంగా – అధికార పరంగా ఉన్న బలమైన శత్రువును ఎదుర్కోవడమంటే పూర్తి స్థాయిలో యుద్ధం చేయాల్సిందే. దీనికి మరో ప్రత్యామ్నాయమంటూ లేదు – షార్ట్ కట్స్ కూడా లేవు. దీర్ఘకాలిక ప్రాతిపదికపైన ఎవరికి ఎలా వీలుంటుందో, ఎంతవరకు చేతనవుతుందో తెలుసుకుని ఆ స్థాయిలో వారందరూ సహాయ సహకారాలు అందించాల్సి ఉంటుంది. ఎవరోవస్తారని ఏదో చేస్తారని

భావించకుండా ఎవరికి వారు తమంతట తామే ఉద్యమాన్ని వివిధ స్థాయిల్లో ముందుకు తీసికెళ్ళాలి. దీర్ఘకాలిక ప్రాతిపదికపైన మన సంస్థ నిర్ణయాలు, ఆచరణ కార్యక్రమాలుండాలి. ఉద్యమించగానే విజయం సాధించలేక పోవచ్చు. అంతలోనే నిరాశ – నిస్పృహలకు లోనయితే లక్ష్యం సాధించడం కష్టం. ఏటికి ఎదురీదడం – సమస్యలను ఎదుర్కొని ఓపికగా – ధైర్యంగా – ఆత్మస్థైర్యంతో పోరాడటం అవసరం. ఆ క్రమంలోనే మనలో ఉన్న కోవర్టులను గుర్తించి, వారిని పక్కనపెట్టి, **'ఒక్కరికొరకు అందరూ అందరి కొరకు ఒక్కరు' అన్న నినాదంతో చదువు – చదివించు, సమీకరించు, చైతన్యపరచూ, ఉద్యమించు, అనుకున్న లక్ష్యం సాధించు, అన్న నినాదాలతో, రాజ్యాధికార అంతిమ లక్ష్యసాధనలో అందర్నీ భాగస్వాములను చేయాలి.** ఇప్పుడున్న పార్టీలన్నీ దాదాపుగా 'ఆదిపత్య  కుల సామ్య' పార్టీలే కనుక వాటి ద్వారా "బిసిల సాధికారత – రాజ్యాధికారం" ఎన్నటికీ సాధ్యం కాదు. అందువల్ల మన సమస్యలకు – మనమే పరిష్కార మార్గాలు వెతుక్కోవాలి. **మనకు భారత రాజ్యాంగమిచ్చిన హక్కులను వినియోగించుకుంటూనే వాటి ద్వారా రాజ్యాంగం పూర్తిగా అమలుచేయాలన్న నినాదంతో పాటు మరో** వైపు విస్తృత వేదికల నిర్మాణం ఏర్పాటు చేసుకుంటూ ముందుకు సాగాలి. అందుకు అవసరమయ్యే వనరులను సమకూర్చుకుంటూ సానుకూల వాతావరణాన్ని మనమే నెలకొల్పవలసి ఉంటుంది. పటిష్టవంతమైన వ్యవస్థీకృత నిర్మాణంతో రాజకీయ ఉద్యమ ప్రాతిపదికగా అంతిమ లక్ష్యాన్ని సాధించడం కోసం మనమంతా పునరంకితం కావాల్సి ఉంటుంది. **నిలువాలంటే గెలిసేవరకూ పోరాడాలి**. బిసిల ఆత్మ గౌరవం, బిసి కులాల సమిష్ఠితత్వంపై ఆధారపడి ఉంటుంది. విడివిడిగా ఏ బిసి కులం కూడా తనకు తానే అధికారంలోకి రాలేదు. అందుకే కనీసం బిసిల్లోని 60 శాతం జనాభా ఐక్యీకరణ చెందాలి. ఆ క్రమంలోనే **మన సంఖ్యాబలమే మన ధైర్యంగా, మన ఓటే మన ఆయుధంగా, మన ఆత్మగౌరవాన్ని మనం నిల్పుకుంటూ, చిన్నచిన్న లాభాలకు ఆశపడకుండా, అమ్ముడుపోకుండా, మనసును చంపుకోకుండా, మన ఆత్మ నమ్ముకోకుండా, మన ఉనికిని, అస్థిత్వాన్ని, గుర్తింపును, చైతన్యాన్ని పునర్ నిర్మించుకుంటూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మన సత్తా చాటుతూ అంతిమ లక్ష్యాన్ని సాధించాలి. తెలంగాణాలో 'రాజ్యాంగం' వర్ధిల్లాలి, ప్రజాస్వామ్యం నిలబడాలి. సామాజిక న్యాయం సాధించబడాలి. ప్రజలందరి ఆత్మగౌరవం కాపాడబడాలి. అభివృద్ధి ఫలాలు అందరూ సమానంగా అనుభవించాలి.** తెలంగాణాలో అందరూ బాగుండాలి. అందులో మనం అందరితో సమానంగా బాగుండాలి. అదే మన అంతిమ లక్ష్యం. **జై సామాజిక తెలంగాణా !**

. . .